క్లుప్తంగా

పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం

అలంపూర్ రూరల్: 1984–85లో పదో తరగతి పూర్వ విద్యార్థులు తాము చదివిన పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన గురువులను సన్మానించారు. పాఠశాల హెచ్ఎంకు కుర్చీని అందించారు. గురువులు హంపయ్య, ఆకుమళ్ల కృష్ణమూర్తి, మహమ్మద్ యూసుఫ్, పూర్వ విద్యార్థులు రహమత్ అలీ, రఘు ప్రసాద్, భాస్కర్‌గౌడ్, నారాయణ, వెంకటేశ్వర్లు, జనార్దన్, సూరి, రవి, జయరాములు, పాషా, ఆకుమల్ల మల్లికార్జున్ శర్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సమావేశం



అయిజ: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం టీపీసీసీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ ఎన్నికల నిమిత్తం మీడియా సమావేశాలు నిర్వహించేందుకు షేక్షావలిని నియమించిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయనను అభినందించారు. పార్టీ పెద్దలు తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, బాధ్యతాయుతంగా పనిచేస్తానన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, నాయకులు అరుణ్, బాషా, బ్రహ్మయ్య, మైబు, నరసింహగౌడ్ పాల్గొన్నారు.

ఎర్రమట్టి తరలింపు



ఉండవెల్లి: మండలంలోని శేరుపల్లె శివారులోని నది ఒడ్డున్న ఉన్న ఎర్రమట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఆదివారం గ్రామంలో రోడ్డుపై దుమ్ము ఇళ్లలో చేరి దెబ్బతిన్నాయని, టిప్పర్లు తిరుగుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొకన్నారు. తహసీల్దార్ వెంకట్రామ్‌ను వివరణ కోరగా ఎలాంటి సమాచారం లేదని, ఎస్ఐ బాల్‌రాజుకు వాహనాలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్ఐ బాల్‌రాజు సిబ్బందితో అక్కడికి వెళ్లిన సమయంలో వాహనాలు లేవని, మరలా వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాష్ట్రాల అభివృద్ధి కేంద్రంతోనే సాధ్యం



మానవపాడు: రాష్ట్రాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం తోనే సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేకే రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 4న గావ్ చలో కార్యక్రమంపై చర్చించినట్లు తెలిపారు. తొమ్మిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ, యోగేష్, ఈశ్వర్, జగన్‌గౌడ్, శేఖర్ నాయుడు, సురేష్ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి పదిశాతం భూమి

- మున్సిపాలిటీలో వెలసిన అక్రమ వెంచర్లు
- అప్రూవల్ లేఅవుట్‌లో భూమి ఇవాల్సిందే..
- స్థలం లేక నిలిచిపోయిన అభివృద్ధి పనులు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



అయిజలో అప్రూవల్ లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్



అయిజలో అప్రూవల్ లేఅవుట్‌లో వచ్చిన భూమిలో ఏర్పాటు చేసిన పార్కు

అయిజ: మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనుల కోసం కొంత భూమిని కేటాయించాలి. అయితే అయిజ మున్సిపాలిటీ పరిధిలో అతి తక్కువ ప్రభుత్వ భూమి ఉంది. వెంచర్లు వేసిన భూమిలో యజమానులు 10 శాతం భూమిని మున్సిపాలిటీకి ఇవ్వాల్సి ఉంటుంది. చాలామంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు అప్రూవల్ లేఅవుట్ లేకుండా వెంచర్లు వేస్తున్నారు. 10 శాతం భూమిని మున్సిపాలిటీకి ఇవ్వడం లేదు. దానివల్ల అయిజ పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు భూమి లేకుండా పోయింది. కనీసం పట్టణంలో పార్కులు, ప్రభుత్వ భవనాలు నిర్మించలేకపోయారు.

స్థలం లేక నిలిచిన అభివృద్ధి పనులు

మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులున్నాయి. సుమారు 7వేల నివాస గృహాలున్నాయి. దాదాపు 30వేల జనాభా ఉంది. జనాభాకు తగ్గట్లు అధికారులు అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. ప్రభుత్వ స్థలం లేకపోవడంతో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతోంది. పట్టణంలో అభివృద్ధి పనులు జరగాలంటే అప్రూవల్ లేఅవుట్ ద్వారా వచ్చిన స్థలం కావాలి. అయితే మున్సిపాలిటీలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునే వారు లేఅవుట్ అప్రూవల్ చేసి పదిశాతం భూమి ఇవ్వడం మొక్కుబడిగా సాగుతోంది. ఇబ్బడి ముబ్బడిగా వెంచర్లు వెలిసినా, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యాపారం చేస్తున్నా మున్సిపాలిటీకి ఇవ్వాల్సిన 10 శాతం భూమి మాత్రం ఇవ్వడంలేదు. అయిజ మున్సిపాలిటీలో అప్రూవల్ లేఅవుట్ ద్వారా ఇప్పటి వరకు సుమారు 4 ఎకరాల భూమి మాత్రమే వచ్చింది. కేవలం 10 వెంచర్ల వారు మాత్రమే 10 శాతం భూమిని ఇచ్చారు. ఇచ్చిన వాటిలో కేవలం రెండు ప్రదేశాల్లో మున్సిపల్ అధికారులు అభివృద్ధి పనులు చేపట్టారు. సర్వే నం.738/బీ లో ఇచ్చిన 9 గుంటల లేఅవుట్‌లో మిషన్ భగీరథకు సంబంధించినవాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. సర్వే నం. 737/బీ లో ఇచ్చిన 30 గుంటల లేఅవుట్‌లో పార్కు ఏర్పాటు చేశారు.

మున్సిపాలిటీకి ఇచ్చిన భూములు ...

సర్వే నం. 911/పీ లో 7 గుంటలు, 524/ఏ2/2 లో 20 గుంటలు, 932/పీ లో 48 గుంటలు, 904/సీలో 10 గుంటలు, 738/బీలో 9 గుంటలు, 738/బీ1/2 లో 18 గుంటలు, 737/బీ లో 30 గుంటలు, 964/పీ లో 24 గుంటలు, 904/సీ లో 10 గుంటలు చొప్పున రియల్ ఎస్టేట్ వ్యాపారులు అప్రూవల్ లేఅవుట్ ద్వారా ఇచ్చారు.

అవగాహన కల్పించాలి



అప్రూవల్ లేఅవుట్‌పై చాలా మందికి అవగాహన లేదు. లే అవుట్ అప్రూవల్ విధా నంతో వచ్చిన పది శాతం భూమి వల్ల అనేక ఉపయోగాలున్నాయి. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి. పట్టణ అభివృద్ధి కోసం వెంచర్లు వేసిన వారి నుంచి 10 శాతం భూమిని తీసుకొని అభివృద్ధి పనులు చేయాలి. తద్వారా అక్కడ వెంచర్లకు డిమాండ్ వస్తుంది. 10 శాతం భూమి ఇచ్చిన వారు కూడా మేలు జరుగుతుంది.

– వెంకటేష్, అయిజ మున్సిపాలిటీ

చట్టపరంగా చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వం తెచ్చిన నూతన చట్టాన్ని పకడ్బందీగా అమలుచేసి, వెంచర్లు వేసిన వారినుంచి 10 శాతం భూమిని మున్సిపాలిటీ అభివృద్ధికి వినియోగిస్తాం. వెంచర్లు వేసిన వారందరూ తప్పకుండా అప్రూవల్ లేఅవుట్ ద్వారా 10 శాతం భూమిని మున్సిపాలిటీకి అప్పగించాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసకుంటాం.

– నిత్యానంద్, మున్సిపల్ కమిషనర్

అభివృద్ధికి సహకరించాలి



పట్టణంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో అనేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. అప్రూవల్ లేఅవుట్ ద్వారా వెంచర్లు వేస్తేనే మున్సిపాలిటీకి 10 శాతం భూమి వస్తుంది. ఆ భూమిలో వివిధ భవనాలు నిర్మించవచ్చు. పార్కులు ఏర్పాటు చేయవచ్చు. వాటర్ ట్యాంక్‌లు నిర్మించుకోవచ్చు. మున్సిపాలిటీకి కావాల్సిన మౌలిక వసతులు అన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుంది. అప్రూవల్ లేఅవుట్ ద్వారా మున్సిపాలిటీకి ఇచ్చిన భూమి చాలా తక్కువగా ఉంది. పట్టణ ప్రజలు మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

– మహబూబ్‌బాషా, అయిజ మున్సిపాలిటీ

అయిజ అభివృద్ధి చెందుతుంది



ప్రజలందరూ సహకరిస్తే అయిజ మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుంది. వెంచర్లు వేసినవారు అప్రూవల్ లేఅవుట్ ద్వారా ఇచ్చిన 10 శాతం భూమి మొత్తం కలిపి ఇంతవరకు కేవలం 4 ఎకరాలు మాత్రమే ఉంది. పార్కులు ఏర్పాటు చేయడానికి ప్రతి వార్డులో ప్రభుత్వ భూమి ఉండాలి. ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు స్థలం కావాలి. అది కేవలం అప్రూవల్ లేఅవుట్ ద్వారానే వస్తుంది. కొంతమంది 10 శాతం స్థలంకు బదులుగా దాని విలువచేసే రుసుం చెల్లిస్తున్నారు. స్థలం ఇస్తేనే అయిజ పట్టణం అభివృద్ధి చెందుతుంది.

– శ్రీనివాసులు, అయిజ మున్సిపాలిటీ

భక్తిశ్రద్ధలతో శివస్వాముల పూజలు



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ధరూరు: మండల కేంద్రంలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో మూడు రోజులుగా శివస్వాములు ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గురుస్వాములు కురువ దర్శెల్లి, బోయమల్లి, బక్ర రవి, సీతారాములు ప్రత్యేక భజనలో పా ల్గొంటున్నారు. అనంతరం ఆలయంలో భిక్ష చేశారు.

ముదిరాజుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



మక్తల్ ఎమ్మెల్యేను కలిసిన గద్వాల్ జిల్లా మత్స్య శాఖ చైర్మన్ గోపాల్

అలంపూర్: ముదిరాజుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని నారాయణపేట జిల్లా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం మక్తల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ గోపాల్, వైస్ చైర్మన్ మద్దిలేటిలు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిసి సన్మానించారు. ముదిరాజుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. ముదిరాజుల సమస్యలను పరిష్కరించేందుకు నావంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు ఎద్దుల రాముడు, ముదిరాజ్ ఐక్య వేదిక కన్వీనర్ టీజీ రాజు, కర్నె నరసింహ, పుల్లూరు నాగులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని అరికడదాం



ప్లాస్టిక్ కవర్ల బదులు సంచులు వాడాలని ప్రజలకు సూచిస్తున్న సేవాసమితి సభ్యులు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వాడకాన్ని అరికడదామని శాంతినగర్ సేవాసమితి వడ్డేపల్లి సభ్యులు పిలుపునిచ్చారు. సేవాసమితి సభ్యుల సమావేశం ఆదివారం శాంతినగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై ఏమి చేయాలని సమాలోచనలు చేశారు. క్యారీబ్యాగుల బదులు కాటన్ సంచులు వాడాలని పట్టణ ప్రజలకు సూచించారు. ప్లాస్టిక్ భూతాన్ని మున్సిపాలిటీ నుంచి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. బట్ట సంచుల వాడకం పర్యావరణానికి మంచిదన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తూ అందరికి అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న రమేష్‌ను సేవాసమితి సభ్యులు శాలువాతో సన్మానించారు. సమావేశంలో సేవా సమితి సభ్యులు షేక్ అస్లాం షరీఫ్, ఖలీల్, వెంకటేష్, దాసువరం, నాగరాజు, ఖాజా, హరీష్, భూపాల్, మాలిక్‌లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడుతాం

అయిజ: అలంపూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి పాటుపడతామని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని కొత్తపల్లి, బైనిపల్లి గ్రామాలలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని చాలా గ్రామ పంచాయతీలకు ఇంతవరకు నూతన భవనాలు నిర్మించలేదన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాలు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మల్దకల్: మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కోరారు. ఆదివారం మల్దకల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాలని కోరారు. ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ఆతికూర్ రహమాన్, సయ్యద్ యూసుఫ్, సర్పంచు యాకోబు, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బాధితులకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పరామర్శ

శాంతినగర్: మండలంలోని జిల్లెడుదిన్నెలో ఇటీవల మరణించిన మార్క్ కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ చల్లా వెంట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు. వారితో పాటు వడ్డేపల్లి మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసు లు, సర్పంచ్‌లు శారద, మాధవి, ఉపసర్పంచ్‌లు నారాయణరెడ్డి, ఆంజనేయులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



గద్వాల రూరల్: పట్టణంలో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా చేపట్టి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. ఆదివారం తెల్లవారుజామున పాతబస్టాండు, కూర గాయల మార్కెట్, షేరెల్లివీధి, కొత్తబస్టాండు, కృష్ణవేణి చౌక్ చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. రోడ్డుపై గుంతలను పూడ్చివేయాలని సూచించారు. టీ విక్రయించే చిరువ్యాపారులతో మాట్లాడారు. తాగిన టీ కప్పులను రోడ్డు బయట వేయకుండా నిర్దేశించిన ప్రాంతంలో వేసి సహకరించాలని, లేనియెడల జరిమానా విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మన్సూర్, రంగన్న, మున్సిపల్ సిబ్బంది పాండు, పరమేష్ పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

గట్టు: మండలంలోని చాగదోణలో నూతనంగా నిర్మించిన బసవన్న గుడికి కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి రవినాయుడు రూ.10 వేల విరాళం ఆ దివారం అందజేశారు. చాగదోణలోని బసవ న్న గుడిని సందర్శించి, గుడి కమిటీ సభ్యులకు ఆయన అందజేశారు. దాతను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

పునః ప్రారంభోత్సవమా?



విలేకరులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, నాయకులు

- దళిత ప్రజా ప్రతినిధులను అవమానించడం సరి కాదు
- ప్రారంభించిన పాఠశాలను మళ్లీ ఎలా ప్రారంభిస్తారు

అలంపూర్ రూరల్: ఉండవెల్లి మండలంలోని కలుగోట్ల గ్రామ కస్తూర్బా పాఠశాల శిలాఫలకాన్ని ఎర్రవల్లి చౌరస్తాలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఎమ్మెల్యే విజేయుడుతో కలిసి మధ్యాహ్నం ప్రారంభించారని, తిరిగి కలుగోట్ల గ్రామంలోని కస్తూర్బా పాఠశాల భవనాన్ని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజేయుడు మళ్లీ పునః ప్రారంభించి అవమానించడం సరైంది కాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు హితవు పలికారు. పట్టణంలోని తెలంగాణ అతిథి గృహంలో ఆదివారం జెడ్పీటీసీలు శంషాద్ ఇస్మాయిల్, రాములమ్మ, కాశపోగు రాజు, సుగుణమ్మ, ఎంపీపీ పింజరి బేగం, బీసమ్మ కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానికంగా ఉన్న తమకు కనీసం సమాచారం ఇవ్వకుండా కస్తూర్బా పాఠశాలను సర్పంచ్ షేక్ హజ్రునీసా ఆధ్వర్యంలో పాఠశాల ఎస్ఓ పరిమళకు కూడా సమచారం లేకుండా రాత్రి 8.30 గంటలకు ప్రారంభించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అలంపూర్ మండలంలో బుక్కాపురం రైతువేదిక, ర్యాలంపాడ్, జిల్లెలపాడ్, గ్రామ పంచాయతీ భవనాలు, జెడ్పీటీసీ నిధుల నుంచి శింగవరం–2 గ్రామంలో పాఠశాల భవనం ప్రారంభోత్సవానికి స్థానిక ఎంపీపీకి, జెడ్పీటీసీకి తెలియకుండా ప్రారంభిచడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాము, గోపాల్, పులిపాటి దస్తగిరి ఎర్రవల్లి సర్పంచ్ జోగులరవి, నాయకులు మేడికొండ లక్ష్మీకాంతరావు, ఇస్మాయిల్, మహేశ్వర్‌గౌడ్, గోకారి, రఫీ, తేజ, రమణ, శ్యాంసుందర్, రామకృష్ణ, నర్సింహ ఉన్నారు.

విద్యుత్ పనుల్లో అధికారులు

అలంపూర్: అలంపూర్, వడ్డేపల్లి పట్టణాల్లోని విద్యుత్ శాఖ అధికారులు శనివారం, ఆదివారం రెండు రోజుల్లో వివిధ సమస్యలను పరిష్కరించి, పనులు పూర్తి చేయించినట్లు ఏడీ సయ్యద్ మగ్బుల్ తెలిపారు. అలంపూర్ పట్టణంలో, మున్సిపాలిటీల్లో, వడ్డేపల్లి పట్టణంలో, మున్సిపాలిటీల్లో మరమ్మతు పనులకు సంబంధించి విద్యుత్ వైర్లు చెట్లకు అడ్డుగా ఉంటే వాటిని తొలగించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉన్న ముల్లపొదలను తొలగించి, ఎక్కడైన విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతుండగా వాటిని సవరించినట్లు పేర్కొన్నారు. అలంపూర్ టౌన్‌లోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు, యార్డు క్లీనింగ్ పనులు ఫీడర్‌లోని నియంత్రికలు, 25 విద్యుత్ నియంత్రికల వద్ద మరమ్మతులు చేసినట్లు తెలిపారు. అలంపూర్, వడ్డేపల్లి ప్రజలు సహకరించడంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

పల్లెలకు చేరని 'పల్లెవెలుగు'

- రోడ్లున్నా.. బస్సు రాదాయె!
- ఆర్టీసీ సౌకర్యం లేక ప్రయాణికుల అవస్థలు
- ఉచిత బస్సుకు నోచుకోని గ్రామాల మహిళలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



బొలెరో వాహనంలో ఎక్కించుకున్న వాహనదారుడు



పరిమితికి మించి ఆటోలో ఎక్కుతున్న ప్రయాణికులు

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెలకు రోడ్డు సౌకర్యం ఉన్నా, ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులు రావడం లేదు. ఎర్రవల్లి మండలంలో ఎర్రవలిచౌరస్తా నుంచి షేకుపల్లి మీదుగా సాసనూలు, దువాసిపల్లి, వీరాపురం, కారుపాకుల, పాత గార్లపాడు వరకు బీటీ రోడ్డు సక్రమంగా ఉన్నా బస్సు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులతో ప్రయానించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటిక్యాల మండలంలోని పొగాకు కంపెనీ నుంచి మునగాల, ఇటిక్యాల మండల కేంద్రం, ఉదండాపురం, చాగాపురం, షాబాద్, సాతర్ల, వావిలాల వరకు బీటీ రోడ్డు నిర్మించారు. కానీ ఆర్టీసీ బస్సు సకాలంలో తిరగకపోవడంతో మహిళలకు ఉచిత బస్సు పథకం ఉపయోగపడక పోవడంతో వేలసంఖ్యలో ప్రయాణికులు నిత్యం కష్టాలు పడుతూ ప్రైవేట్ వాహనాల్లో రాకపోకలు సాగిస్తున్నారు.

పల్లె ప్రజలకు ప్రయాణ కష్టాలు

ఇటిక్యాల మండలంలో పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేని కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బస్సుకు నోచుకోవడంలేదు. ప్రజలు నిత్యం ప్రైవేట్ వాహనాల ద్వారానే ప్రయాణం చేస్తున్నారు. ఆయా మండలాల్లోని పెద్దదిన్నె, గోపల్‌దిన్నె, షేకుపల్లి, సాసనూలు, దువాసిపల్లి, వీరాపురం, కారుపాకుల, గార్లపాడు, వేముల, బట్లదిన్నె, వల్లూరు గ్రామాలకు కొన్ని నెలలుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అంతకు ముందు గద్వాల డిపో నుంచి మూడు రూట్లలో పల్లెల మీదుగా ఆర్టీసీ బస్సులు ఉదయం నుంచి రాత్రి వరకు తిరిగేవి. కరోనా సమయంలో లాక్‌డౌన్ పెట్టడంతో బస్సు సౌకర్యం బంద్ అయ్యింది. తిరిగి బస్సు సర్వీలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రైవేట్ వాహనాలదే ఇష్టారాజ్యం

నిత్యం ఆయా మండల కేంద్రాలతో పాటు ఎర్రవల్లి చౌరస్తాకు వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వాహనదారులు ఇష్టాను సారంగా పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తూ ప్రమాదాలకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పల్లెలకు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



ఎర్రవల్లిచౌరస్తా నుంచి షేకుపల్లి మీదుగా కారుపాకులకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు లేక ప్రదానికి ఇబ్బందులు తప్పడం లేదు. పనుల నిమిత్తం ఇతర గ్రామాలకు వెళ్లవల్సి వస్తే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. నిత్యం ప్రయాణికుల సమస్యలు తీర్చేందుకు పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించాలి.

– రవికుమార్, కారుపాకుల

ఉన్నతాధికారులు స్పందించాలి



పల్లెలకు సకాలంలో బస్సులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాలకు బస్సులు నడపాలని పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా, నేటి వరకు సమస్య పరిష్కారం కాలేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– రామాంజనేయులు, సాసనూలు